సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ; 3 ; జనవరి ; 2023



మెనూ మెరుగ్గా..
చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషకాల ఆహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెనూను మెరుగుపరచింది. ఇందు కోసం మెనూ చార్జీలను పెంచింది.
- 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.56.850
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5.078
3 శాతం జీఎస్టీతో	రూ.5.230
సవర (8 గ్రా)	రూ.41.840

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
30.6 /23.4

జిల్లాలో మంగళవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. వాతావరణంలో తేమ 65 శాతం ఉంది.

న్యూస్‌రీల్

చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరించాలి



బాధితురాలి సమస్యలు వింటున్న ఏఎస్పీ హిమవతి

నెల్లూరు (క్రైమ్): చట్టపరిధిలో ప్రజల వినతులను పరిష్కరించాలని ఏఎస్పీ డి.హిమవతి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 40 మంది తమ సమస్యలపై ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. వారి సమస్యలను విన్న ఆమె సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నిర్ణీత వ్యవధిలో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కారం చూపాలన్నారు. దంపతుల విషయంలో తొందరపడి కేసులు నమోదు చేయకుండా కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాలను చక్కదిద్దాలన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే పిల్లలపై చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఫిర్యాదుదారులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రూ.13 కోట్ల మద్యం విక్రయాలు

నెల్లూరు (క్రైమ్): నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31, జనవరి ఒకటో తేదీల్లో జిల్లా వ్యాప్తంగా రూ.13 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. డిసెంబర్ 31న రూ.7,54,36,021 విలువ చేసే 7,882 లీటర్ల మద్యం, 2,385 లీటర్ల బీరు విక్రయాలు జరిగాయి. జనవరి 1న రూ.5,89,7,510 విలువైన 6,729 లీటర్ల మద్యం, 1,700 లీటర్ల బీరు విక్రయాలు జరిగాయి. మొత్తంగా రెండు రోజుల్లో రూ.13,43,83,531 విలువ చేసే మద్యం అమ్మకాలు జరిగాయి.

మళ్లీ మాస్క్ మస్ట్



నెల్లూరు(అర్బన్): కోవిడ్ కొత్త వేరియంట్ బీఎఫ్-7 ప్రస్తుత పండగల సీజన్లలో విజృంభించకుండా ఉండాలంటే ప్రజలు తప్పని సరిగా మళ్లీ మాస్క్‌ను వినియోగించి, భౌతిక దూరం పాటించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తీవ్ర శ్వాసకోశ సమస్యలున్నవారు, ఇన్‌ఫ్లూయింజా లక్షణాలున్న వారు అశ్రద్ధ చేయకుండా తక్షణమే ఆస్పత్రిలో చేరి కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తద్వారా కొత్త వేరియంట్ వైరస్‌ను తెలుసుకునేందుకు వీలవుతుందన్నారు. ఆస్పత్రుల్లో అవసరమైన బెడ్స్‌ను, ఇతర చికిత్సా సౌకర్యాలను సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రుల డాక్టర్లకు సూచించారు. ప్రజలు ప్రికాషన్ డోస్ వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. 60 ఏళ్లు పైబడిన వారికి తప్పని సరిగా మిగిలిన డోసుల వ్యాక్సిన్ ఇవ్వాలని కోరారు. చేతులు తరచూ శుభ్ర పరుచుకోవాలన్నారు. జన సమూహాల్లోకి సాధ్యమైనంత వరకు వెళ్లొద్దన్నారు. గాలి, వెలుతురు ఉండేటట్లు ప్రజలు చూసుకోవాలన్నారు. ప్రజలు అవగాహన కలిగి ఉంటే కోవిడ్‌ను ఎదుర్కోవచ్చన్నారు.

90 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. రెండో రోజు సోమవారం నాటికి 90.07 శాతం మంది లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. 3,14,237 మంది లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయాల్సి ఉండగా 2,33,027 మందికి అందజేశారు. వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వారోత్సవాల్లో పాల్గొని కొత్తగా పింఛన్ మంజూరైన వారికి నగదు అందించారు.

జిల్లా టీ20 క్రికెట్ పోటీలకు ఆహ్వానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీ 20 పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి బీఎస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు 15 మంది జట్టు సభ్యుల జాబితాతో ఈ నెల 11వ తేదీ లోపల ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఎంట్రీలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ రుసుం రూ.2,360 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9949152527, 8328536679 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉత్తర ద్వారదర్శనం



ఉత్తరద్వారదర్శనానికి ముందు శ్రీదేవి,భూదేవి సమేత రంగనాథుడికి ఉత్సవం

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం జిల్లాలో ప్రధాన దేవాలయాల్లో కొలువైన దేవదేవేరులు ఉత్తర ద్వారదర్శనమిచ్చారు. ఈ రోజున వైకుంఠ ద్వారాలు తెరుచుకుని ఉంటాయి. దేవదేవేరులను ఉత్తర ద్వారదర్శనం చేసుకోవడం ద్వారా ముక్తిని పొందుతారని, వైకుంఠ ప్రాప్తి లభిస్తుందని వేదాలు చెబుతున్నాయి. దీంతో వైకుంఠ ఏకాదశి రోజున స్వామివార్ల దర్శనానికి వేకువకు ముందే భక్తులు వైష్ణవాలయాలకు పోటెత్తారు. జిల్లాలోని ప్రధానమైన రంగనాయకుల స్వామి, నరసింహకొండ, రాపూరులోని నృసింహ క్షేత్రం, కొండబిట్రగుంటలోని బిలకూట క్షేత్రాలకు భక్తులు బారులు తీరారు. ఆయా ఆలయాల్లో అధికారులు, ట్రస్ట్ బోర్డు భక్తులకు ఏర్పాట్లు చేశారు.



రంగనాయకుల పేటలో స్వామివారి ఉత్తరద్వారదర్శనానికి వేకువకు ముందే బారులు తీరిన భక్తులు

ఊరంతా ఆర్మీ

నాలుగు దశాబ్దాలుగా దేశ సేవలో దేవిశెట్టిపల్లి

అదొక చిన్న కుగ్రామం. ఆ ఊరుకు కనీసం బస్సు సౌకర్యం కూడా ఉండదు. అటువంటి ఈ గ్రామం దేశ సేవలో అహర్నిశలు శ్రమిస్తోంది. ప్రతి ఇంటి బిడ్డను భరతమాత సేవకు అంకితం చేస్తోంది. ఇక్కడ పుట్టిన ప్రతి ఒక్కరు మరో ఉద్యోగం కోసం వెంపర్లాడకుండా భారతీయుల భద్రతే లక్ష్యంగా దేశ సరిహద్దుల్లో ఉండి కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ప్రతి కుటుంబం 'జై జవాన్-జై కిసాన్' స్ఫూర్తితో ఉంటోంది.

దేవిశెట్టిపల్లి గ్రామం వ్యూ





- ప్రతి కుటుంబంలో ఒకరు త్రివిధ దళాల్లో ఉద్యోగాలు
- 110 కుటుంబాల నుంచి 150 మందికి పైగా విధులు
- 30 మంది సైనికులుగా ఉద్యోగ విరమణ
- ఇతరత్రా ప్రభుత్వ విభాగాల్లో కొలువులు
- రిటైర్ అయిన తర్వాత పొలం బాట
- గ్రామాభివృద్ధిలో సైనికుల కీలక పాత్ర

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆ ఊరి యువత గుండెల నిండా జై జవాన్, జై కిసాన్ స్ఫూర్తిని నింపుకుంది. కంప్యూటర్, కార్పొరేట్ ఉద్యోగాల వైపు నేటి యువత పరుగులిడుతుంటే.. ఆ ఊరి యువకులు దేశ సేవకు అంకితమవుతున్నారు. భరతమాత సేవలో పునీతమై.. తిరిగొచ్చి భూమాత సేవలో తలమునకలవుతున్నారు. జిల్లాలో సీతారామపురం మండలం దేవిశెట్టిపల్లి.. ఓ మారుమూల పల్లె. ఆ ఊరులో ఇంటికో సైనికుడు ఉన్నాడంటే ఆశ్చర్యమేస్తోంది. దేశ సేవలో తరించాలన్న ఉత్సాహంతో పదో తరగతి పాసైతే చాలు జై జవాన్ అంటూ దేశ సేవకు వెళ్లిపోతున్నారు. గ్రామంలో 110 కుటుంబాలు ఉంటే 150 మందికి పైగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఇంకా త్రివిధ దళాల్లోనూ ఆ ఊరి యువకులు కనిపిస్తారు. ఒక్కో ఇంటి నుంచి ఇద్దరు, ముగ్గురు యువకులు సైన్యంలో ఉండడం ఈ ఊరి ప్రత్యేకత. 1979లో దేవిశెట్టిపల్లికి చెందిన గోగుల బాలవెంగయ్యతో మొదలైన ఆర్మీ ప్రస్థానం ఇప్పటికీ అప్రతిహతంగా కొనసాగుతోంది. ఆయన్ను ఆదర్శంగా తీసుకున్న ఒకరిద్దరితో మొదలై నేడు 150 మంది వరకు భరతమాత సేవలో కొనసాగుతున్నారు.. త్రివిధ దళాల్లో ఉన్నత తమ బిడ్డలను చూసి గ్రామస్తులు మురిసిపోతుంటారు.

రెండే రెండు వృత్తుల్లో..

గ్రామంలో వివిధ సామాజిక వర్గాలు ఉన్నప్పటికీ రెండే రెండు వృత్తుల్లో కొనసాగుతున్నారు. ఉంటే జవాన్లుగా, లేదంటే రైతులుగా జీవితాలను గడుపుతున్నారు. మొదటి నుంచి అందరూ మిలటరీ వైపు మొగ్గు చూపడంతో మిగతా వృత్తుల వైపు ఆసక్తి చూపడం లేదు. ఆయా ఉద్యోగాల్లో దేశానికి సేవ చేయడం తమకు ఆనందం కలిగిస్తోందని చెబుతుంటారు. గాంకమంలోరి మిలటరీ మ్యాన్‌లు గోవా, పంజాబ్, పూణే, గుజరాత్, ఢిల్లీ, కోల్‌కతా, కేరళ, హరియాణా, ముంబయి, చండీగఢ్ తదితర రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో సిపాయిలు, లాన్స్ నాయక్, హవాల్దార్లు, సిగ్నల్ మెన్స్, నాయకులు, ఆపరేటర్స్, టిడ్‌మెన్స్, సివిలియన్ ఎంప్లాయిస్‌లో స్వీపర్లు, లైన్‌మెన్, వాటర్ మెన్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన అనంత సుధాకర్ మేజర్ ఆఫీసర్‌గా, రేనాటి వెంటసుబ్బానాయుడు, కొత్త రత్తయ్య సుబేదార్లుగా ప్రమోషన్ పొంది విధులు నిర్వర్తిస్తున్నారు. మిలటరీ నుంచి రిటైర్డ్ అయిన వారు గ్రామంలో 30 మంది విశ్రాంత సైనికులు పొలం పనులు చేసుకుంటూ వచ్చే పెన్షన్‌తో ఆనందంగా గడుపుతున్నామన్నారు. తమ పిల్లలను కూడా ఇప్పుడు మిలటరీలో విధుల్లో చేర్పించడం ఆనందంగా ఉందని చెబుతున్నారు. ఎప్పుడూ చూసినా గ్రామంలో ఓ వంద మంది కూడా ఉండరూ గ్రామమంతా నిర్మానుష్యంగా నిశ్శబ్దంగా ఉంటుంది. గ్రామంలో పెళ్లిళ్లు, తిరునాళ్లు జరిగినా రాని వారంతా మే నెలలో సెలవుల్లో గ్రామమంతా జనాలతో సందడిగా ఉంటుంది.

ఆహ్లాదం.. ఆనందం

రోడ్డుకు ఇరు వైపులా పచ్చని చెట్లు. నునుపైనా తారు రోడ్డుపై ఆ ఊరుకు వెళ్తుంటే ఆహ్లాదంగా ఆనందంగా ఉంటుంది. అందరూ కలిసి కట్టుగా గ్రామాభివృద్ధికి తోడ్పడుతారు. గ్రామం అంతా కలిసి చందాలుగా వేసుకుని రూ.20 లక్షలతో గ్రామ పొలిమేరలో 20 అడుగుల ఆంజనేయ విగ్రహం, రూ.15 లక్షలతో నిర్మించుకున్న ఎల్లమ్మ ఆలయం గ్రామానికి ఎంతో వన్నె తెచ్చాయి.

40 ఏళ్లుగా ఒక్కొక్కరుగా..

ఇంతింతై వటుడింతైనట్లు.. ఆర్మీ వైపు ఒక్కొక్కరు నుంచి నూటయాభై మంది వరకు అడుగులు వేశారు. 1979లో ఈ గ్రామానికి చెందిన గోగుల బాలవెంగయ్య ఆర్మీలో చేరారు. అప్పటి నుంచి ఒకరిని చూసి ఒకరు ఇప్పటికి చేరుతూనే ఉన్నారు. 40 ఏళ్ల నుంచి గ్రామంలోని దాదాపు అన్ని కుటుంబాలు మిలిటరీ రంగాన్నే తప్ప ఇతర రంగాలను ఎంచుకోలేదు. గ్రామస్తుల్లో సుమారు 50 మంది ఆర్మీలో జవాన్‌లుగా ఉండగా, మరో 55 మంది సివిలియన్ ఉద్యోగాలు, హవాల్దార్, సుబేదార్, నాయక్, సుబేదార్‌లుగా పనిచేస్తున్నారు. నేవీలో ఇద్దరు, ఎయిర్‌ఫోర్స్‌లో ఆరుగురు, గోవా పోలీసులుగా నలుగురు, ఆంధ్రా పోలీసుగా ఒకరు, అగ్నిమాపక శాఖలో ఒకరు విధులు నిర్వహిస్తున్నారు. గోవాలో పీడబ్ల్యూడీ విభాగంలో ఏడుగురు ఉద్యోగాలు చేస్తుండగా మరి కొందరు ప్రైవేటు ఉద్యోగాల్లో ఉన్నారు. ఇలా సుమారు 120 మంది ఆర్మీలో పని చేస్తుండగా మరో 30 మంది త్రివిధ దళాల్లో విధులు నిర్వహిస్తున్నారు.



సుందరంగా కనిపిస్తున్న, రహదారి

సేద్యంలోనూ సారథులు

గ్రామంలో సుమారు 110 కుటుంబాలు ఉన్నాయి. ఒక్కొక్కరికి వారి స్థోమను బట్టి రెండెకరాల నుంచి పది, ఇరవై ఎకరాలు ఉన్న వారు కూడా ఉన్నారు. ఆర్మీలో రిటైర్ అయిన తర్వాత అందరూ వ్యవసాయంలోనూ రాణిస్తున్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు భూములు కల్పించారు. దీంతో తమ పొలాల్లో బోర్లు వేసుకుని వివిధ రకాల పంటలను సాగుచేస్తున్నారు. బోర్లలో నీరుండడంతో ముక్కారు పంటలు పండిస్తున్నారు.

దేశం కోసం పనిచేయడం గర్వంగా ఉంది



ఆర్మీలో చేరి దేశం కోసం పనిచేయడం గర్వంగా ఉంది. ప్రతి ఒక్కరూ కుటుంబాన్ని ప్రేమించినట్లే దేశాన్ని ప్రేమించాలి. యువత ఆర్మీలో చేరేందుకు ఉత్సాహం చూపినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుంది. చాలా మంది సైనికులుగా చేరాలంటే భయపడతారు. అలా భయపడాల్సిన అవసరం లేదు. దేశ సేవలో ఉండడం పూర్వజన్మ సుకృతం.

– పులికృష్ణ, ఆర్మీ ఉద్యోగి

ఆర్మీలో పనిచేయడం ఓ కల



ఆర్మీలో పనిచేయడం ఓ కలగా భావించి ఎంతో శ్రమించి ఆర్మీలో ఉద్యోగం సంపాదించాను. 25 ఏళ్లు మిలటరీలో పనిచేసి రిటైర్డ్ అయ్యాను. వివిధ విభాగాల్లో గ్రామానికి చెందిన ఎంతో మంది యువకులు పని చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ సంతోషంగా గడుపుతున్నాం.

– రేనాటి వెంకటసుబ్బయ్య, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి

వేసవిలో అందరం కలుసుకుంటాం



ఉద్యోగ రీత్యా వేరే ప్రాంతాల్లో స్థిరపడినా వేసవి సెలవుల్లో అందరం గ్రామంలో కలుస్తాం. మే నెలలో జరిగే తిరునాళ్లలో అందరూ కలిసి గ్రామానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఎక్కువగా అందరం కలిసినప్పుడే గ్రామంలో వివాహాలు చేసుకుంటారు.

– గోగుల ప్రసాద్, నేవీ షిప్‌యార్డ్

ఒకరి ప్రేరణతో మరొకరు మిలటరీలో చేరిక



గ్రామంలో ఒకరిని చూసి మరొకరు ప్రేరణ పొంది ప్రతి కుటుంబంలో ఒకరి నుంచి ముగ్గురు వరకు మిలటరీలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్నారు. గ్రామంలో 110 కుటుంబాలు ఉంటే 150 మంది వరకు దేశం కోసం పనిచేయడం సంతోషంగా ఉంది.

– అనంతు మల్లికార్జున, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి

వచ్చే నెలలో జిల్లాకు సీఎం

- జగనన్న కాలనీల్లో గృహాల ప్రారంభం
- కలెక్టర్ చక్రధర్‌బాబు వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన జేసీ తదితరులు

నెల్లూరు (అర్బన్): వచ్చే నెల ఫిబ్రవరిలో జగనన్న లేఅవుట్లలో నిర్మించిన గృహాలను ప్రారంభించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు రానున్నారని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఇతర జిల్లా శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద రెండు మెగా లేఅవుట్లలో గృహాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. వాటిని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. ప్రస్తుతం వర్షాలు ఆగిపోయాయని, బిల్లుల చెల్లింపు సమస్య లేదని తెలిపారు. గృహనిర్మాణాల శాఖాధికారులతో పాటు మండల ప్రత్యేకాధికారులు శ్రద్ధ వహించి గృహాలను వేగంగా పూర్తి చేయించాలన్నారు. ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ–ఆఫీస్ ద్వారానే ప్రత్యుత్తరాలు జరపాలన్నారు. సంబంధిత రికార్డులు ఈ–ఆఫీస్ నుంచే పంపాలని, భౌతికంగా ఫైళ్లు తీసుకోవడం జరగదన్నారు. సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన ఏపీ ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ ద్వారా ఫేషియల్ రికగ్నిషన్ హాజరు తప్పనిసరిగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి వేయాలన్నారు. స్పందన యాప్‌లో ప్రతి రోజు లాగిన్ అయి అర్జీలను పరిశీలించి సకాలంలో తక్షణమే పరిష్కరించాలన్నారు. ఇంకా కొంత మంది అధికారులు స్పందన లాగిన్లు ఓపెన్ చేయడం లేదన్నారు. 24 గంటల్లో పరిష్కారం కావాల్సిన అర్జీలు ఇంకా 20 ఉన్నాయన్నారు. తక్షణమే వాటిని పరిష్కరించాలన్నారు. కోవిడ్ కొత్త వేరియంట్ బీఎఫ్–7 విస్తరిస్తున్న దృష్ట్యా మాస్కులు వేసుకుంటేనే ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల్లోకి, బ్యాంక్‌ల్లోకి అనుమతించాలని సూచించారు. కోవిడ్ నియంత్రణకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని ముందస్తు వసతులు ఏర్పాటు చేయాలన్నారు. మూడో డోసు వ్యాక్సిన్ కూడా ప్రజలు వేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కోర్టు కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. పింఛన్ కానుక వారోత్సవాల్లో ఏమైనా సమస్యలు వస్తే తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అక్రమ మైనింగ్ జరిపే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ, మెప్మా, ఏపీఎంఐపీ, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, రవీంద్ర, శ్రీనివాసులు, నాగరాజు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, టీజీపీ స్పెషల్ కలెక్టర్ ఎంపీ సుధాకర్, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోమశిలలో 71.997 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 71.997 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 6,464 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 450, దక్షిణకాలువకు 300, కండలేరుకు 1,600 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 99.760 మీటర్ల మట్టం నమోదైంది. నగటున 306 క్యూసెక్కులు ఆవిరవుతోంది.

దర్శించి.. తరించి..

- భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి
- కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- ఉత్తరద్వారంలో తల్పగిరీశుని దర్శనం




భక్తులకు దర్శనమిస్తున్న రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి

నెల్లూరు(బృందావనం): జిల్లా వ్యాప్తంగా వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశిని (వైకుంఠ ఏకాదశి) సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రూపాల్లో కొలువైన మహావిష్ణుమూర్తి భక్తులకు వైకుంఠ ద్వారదర్శనమిచ్చారు. విశేషమైన ముక్కోటి ఏకాదశినాడు ఉత్తరద్వారంలో స్వామిని దర్శించుకోవడం ద్వారా అటు ముక్తిని ఇటు భక్తిని పొందుతామన్న విశ్వాసంతో భక్తులు వేకువజాము నుంచే ఆలయాలకు పోటెత్తారు.

- నెల్లూరులోని రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో స్వామి ఉభయదేవేరులతో సర్వాలంకారశోభితంగా కొలువయ్యారు. మున్నెన్నడూ లేని విధంగా తెల్లవారుజామున 2.30గంటలకు ఉత్తరద్వార దర్శనంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. తొలుత స్వామికి ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యుల అధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు సంప్రదాయంగా, శాస్త్రోక్తంగా ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. స్వామి ప్రాకారోత్సవం అనంతరం రావత్తు మండపంలో ఐదు చుట్లు ఉత్సవం నిర్వహించారు. అనంతరం అలంకార మండపంలో వేంచేపు చేసి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. వైకుంఠ ద్వారదర్శనం ఉభయకర్తలుగా ఆనం వెంకటరెడ్డి, వెంకటరమణమ్మ స్మృత్యార్థం వారి కుమారులు, అలాగే పాలవర్తి ఆండాళమ్మ ఎండోమెంట్ తరఫున కంచర్ల రాఘూర్‌నాథ్, కిశోర్‌నాథ్ వ్యవహరించారు.

విశేషంగా పూలంగిసేవ

మూలవర్లు పూలంగిసేవలో భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా చుండూరు వసుంధరమ్మ వ్యవహరించారు. దేవస్థానం ప్రాంగణంలో కొలువైన తాయార్ల, ఆండాళ్‌తాయార్లకు, అలంకార మండపం, శ్రీప్రసన్నవెంకటేశ్వర



బిట్రగుంట: గరుడ వాహనంపై దర్శనమిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరుడు

స్వామివారికి పూలంగిసేవల ఉభయకర్తలుగా రొత్తు నరసింహారావు, గుండ్లపల్లి మాల్యాద్రి అంబరీష్, మాధవి, వేళ్ల హరిబాబునాయుడు, వేమిరెడ్డిప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి వ్యవహరించారు.

- ప్రభుత్వ నిబంధనల మేరకు భక్తులను అంతరాలయంలోకి ప్రవేశం కల్పించలేదని, లఘు దర్శనం కల్పించామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఎ.శివకుమార్ అచారి తెలిపారు. అలాగే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.



మూలాపేటలో స్వామి దర్శనం కోసం వైకుంఠద్వారం వద్ద వేచి ఉన్న భక్తులు

12వ తేదీ వరకు..

ఈనెల 12వ తేదీ వరకు భక్తులు రోజూ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం చేసుకోవచ్చని దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు తెలిపారు.

- మూలాపేటలోని రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి ఉత్తర ద్వారదర్శనంలో భక్తులను కటాక్షించారు. మూలవర్లు విశేష పూలంగిసేవలో దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సభ్యులు తుమ్మల సుమన్ తేజారెడ్డి, ఆనం చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు. ఈఓ దాసరి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా మూలస్థానేశ్వర స్వామి తెప్పోత్సవం

మూలాపేటలోని శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి పుష్కరిణిలో సోమవారం రాత్రి శ్రీగణపతి, గంగ, భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లు విశేషాలంకారంలో కొలువై పుష్కరిణి వద్దకు పల్లకిసేవగా తెప్ప వద్దకు తరలివచ్చారు. ఉత్సవమూర్తులు కొలువైన పల్లకిసేవలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. పుష్కరిణిని విద్యుద్దీపాలతో నయనానందకరంగా అలంకరించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



పల్లకిసేవలో సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్



స్వామి తెప్పోత్సవం

మెనూ.. మెరుగ్గా

అంగన్‌వాడీ కేంద్రాలను గత టీడీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పరిస్థితిలో మార్పు వచ్చింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రుచికరమైన భోజనం అందుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణతో సేవలు మరింత మెరుగ్గా అందుతున్నాయి.

- అంగన్‌వాడీ కేంద్రాల్లో రుచికరమైన భోజనం
- మెనూ చార్జీలను పెంచిన ప్రభుత్వం

కోవూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలనిస్తోంది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా కూరగాయలు, ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తోంది. నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో మెనూలో లోటుపాట్లు తలెత్తకుండా చార్జీలను పెంచింది. గతంలో ఒక్కో బాలింత, గర్భిణికి రూ.3 చెల్లిస్తుండగా ఆ ధరను రూ.5.77 పెంచింది. అలాగే పిల్లలు ఒక్కొక్కరిపై రూ.1.70 ఖర్చు చేస్తుండగా ఈ మొత్తం రూ.2.10కు చేరింది. దీనిని నవంబర్ నుంచి అమలు చేస్తున్నారు. ఇప్పటికే చిక్కీలు, ఖర్జూరం, అటుకులు, జొన్నపిండి, బెల్లం, రాగిపిండితో కూడిన కిట్లను ప్రభుత్వం అందజేస్తోంది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా ఉన్నతాధికారులు మెనూను పక్కాగా అమలు చేస్తున్నారు. లబ్ధిదారులకు ఐదురోజులపాటు కోడిగుడ్లు, పాలు, రోజుకు ఒక రకమైన వంటతో పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకున్నారు. సీడీపీఓ, సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

అద్దె పెంపు

జిల్లాలో 997 కేంద్రాలు సొంత భవనాల్లో, 787 సామాజిక భవనాల్లో, అద్దె భవనాల్లో 1,150 నడుస్తున్నాయి. గతంలో అద్దె తక్కువ కావడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని సదుపాయాలతో కూడిన భవనాలను అద్దెకు ఇచ్చేందుకు ఇంటి యజమానులు ఇష్టపడేవారు కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వసతి లేని ఇరుకు గదుల్లో అంగన్‌వాడీ నిర్వహించాల్సి వచ్చేది. ఇకపై ఈ సమస్య తొలగిపోతుంది. అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు చెల్లించే మొత్తాన్ని ప్రభుత్వం పెంచింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కేంద్రాలకు గతంలో రూ.1,000 ఇవ్వగా రూ.2 వేలకు పెంచింది. పట్టణ ప్రాంతాల్లో రూ.4 వేలు నుంచి రూ.6 వేలు చెల్లిస్తుంది. గత ఏడాది ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

జిల్లాలో..

అంగన్‌వాడీ కేంద్రాలు : 2,934	ప్రాజెక్టులు : 14
గర్భిణులు : 14,141 మంది	బాలింతలు : 15,499 మంది
చిన్నారులు : 1,40,028 మంది	

ఏ రోజు ఏంటి?

సోమవారం అన్నం, దోసకాయ పప్పు, కోడిగుడ్డు కూర, పాలు, మంగళవారం అన్నం, టమోటా పప్పు, కోడిగుడ్డు కూర, పాలు, బుధవారం అన్నం, ఆకుకూర పప్పు, కోడిగుడ్డు కూర, పాలు, గురువారం ఎగ్ ఫ్రైడ్ రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబార్, పాలు, శుక్రవారం అన్నం, బీరకాయ పప్పు, మునగాకు లేదా పాలకూరతో గుడ్డు కూర, పాలు, శనివారం వెజిటబుల్ రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబార్, కోడిగుడ్డు, పాలు తదితరాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో పెడుతున్నారు.

సంతోషంగా ఉంది



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు అందిస్తున్న మెనూ చార్జీలు పెంచడం సంతోషంగా ఉంది. గతంతో పోల్చుకుంటే కూరగాయలు, ఆకుకూరలు, రవాణా చార్జీలు చాలా పెరిగాయి. పాత మెనూ చార్జీలతో ఇబ్బంది పడేవాళ్లం. ప్రభుత్వం చార్జీలు పెంచి ఊరట కల్పించింది.

– సౌదామిని, అంగన్‌వాడీ కార్యకర్త

హర్షణీయం



ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచడం ఎంతో హర్షణీయం. ఈ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నాం. ఈ విధానం ఎంతో బాగుంది.

– కవిత, అంగన్‌వాడీ కార్యకర్త, కోవూరు

పక్కాగా మెనూ అమలు



ప్రభుత్వం ఆదేశించిన విధంగా మెనూను పక్కాగా అమలు చేస్తున్నాం. సూపర్‌వైజర్లు, సీడీపీఓలు నిరంతరం పర్యవేక్షించాలి.

– సౌజన్య, ఐసీడీఎస్ పీడీ, నెల్లూరు

జిల్లాస్థాయి శాప్ లీగ్ కబడ్డీ పోటీలకు ఎంట్రీల నమోదు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాస్థాయి శాప్ లీగ్ కబడ్డీ ఎంపికలకు సీనియర్స్ మహిళలు (75 కేజీలు), పురుషుల (85 కేజీలు) నుంచి ఎంట్రీలు ఆహ్వానిస్తున్నామని ఆ సంస్థ చీఫ్ కోచ్ ఆర్‌కే ఎతిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ ఎంట్రీలు/రిజిస్ట్రేషన్లను శాప్ లీగ్స్ యాప్ ద్వారా మాత్రమే నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంట్రీ ఫీజు రూ.100ను సదరు యాప్ ద్వారానే చెల్లించాలన్నారు. బుధవారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఎంపికలు జరుగుతాయన్నారు. వివరాలకు కోటయ్య, కబడ్డీ కోచ్ మొబైల్ నంబర్ 98661 63095ను సంప్రదించాలని కోరారు.

రెండు బైక్‌ల ఢీ


- హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

గుడ్లూరు: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని గుడ్లూరు – తెట్టు ప్రధాన రహదారిలో మామిడి చెట్లు సెంటర్ వద్ద సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దేవరకొండ వెంకటేశ్వర్లు నైట్ డ్యూటీ చేయడానికి కావలి నుంచి తన మోటార్‌బైక్‌లో గుడ్లూరుకు వస్తున్నాడు. ఈక్రమంలో మామిడి చెట్ల సెంటర్ వద్దకు వచ్చే సరికి గుడ్లూరు నుంచి తెట్టు వైపు బైక్‌లో వెళుతున్న యువకుడు వేగంగా వెంకటేశ్వర్లు బైక్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో రోడ్డుపై పడిన వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో ఆయన్ను చికిత్స నిమిత్తం కావలికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	130
లేయర్ (లైవ్)	85
బ్రాయిలర్ చికెన్	226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	250
లేయర్ చికెన్	145

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	రూ.15
సన్నవి	రూ.10
పండ్లు	రూ.4

వేమిరెడ్డికి ఘన సన్మానం



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నెల్లూరు(సెంట్రల్): రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సోమవారం నెల్లూరులోని ఆయన నివాసంలో పలువురు కలిసి ఘనంగా సత్కరించారు. ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, నాయకులు కలిసి వేమిరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

శ్రీగౌరి ప్రీతి డెవలపర్స్, బిల్డర్స్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(బృందావనం): నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డులో పీటీ పెట్రోలు బంక్ ఎదురుగా శ్రీగౌరి ప్రీతి డెవలపర్స్, బిల్డర్స్ కార్యాలయాన్ని సోమవారం నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇంటి కలను సాకారం చేసుకునేందుకు శ్రీగౌరి ప్రీతి డెవలపర్స్, బిల్డర్స్ వారిచే పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసిన నుడా అప్రూవ్డ్ లేఅవుట్ శ్రీఅములూరమ్మ ఎస్టేట్ అని చెప్పారు. నగరానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఎస్టేట్‌ను అన్నివర్గాల వారికి అందుబాటులో ఉంచిన డైరెక్టర్ బద్దెపూడి రజిని చౌదరి అభినందనీయులన్నారు. ఈ సంస్థ ప్రగతి సాధించి పలువురి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. రజిని చౌదరి మాట్లాడుతూ 20, 25 అంకణాల్లో, 36 సులభ వాయిదాల్లో (ఈఎంఐ సౌకర్యంతో) అందరికీ అందుబాటు ధరల్లో ప్లాట్ కొనుగోలు చేసే సువర్ణ అవకాశం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐదో డివిజన్ కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి, సంక్రాంతి కల్యాణ్, పోలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షలో అధికారుల బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(టౌన్): సమగ్రశిక్షలో ఫారిన్ సర్వీసు కింద పలువురు ఉద్యోగులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలువాయి ఎంఈఓగా పనిచేస్తున్న సుధీర్‌బాబు ఏఎంఓగా, కొండాపురం మండలం సాయిపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్న బాలకృష్ణ ఎంఐఎస్ కో–ఆర్డినేటర్‌గా, దుత్తలూరు మండలం రాచవారిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్న మమత గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి (జీసీడీఓ)గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా వారు సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణిని మర్యాదపూర్వకంగా కలిశారు.